క్లుప్తంగా

రెండుపూటలా పనులకు హాజరుకావాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

మెరకముడిదాం: ఉపాధి పనులకు రెండుపూటలా హాజరుకావాలని ఎంపీడీఓ జి.భాస్కరరావు వేతనదారులకు సూచించారు. కొర్లాం గ్రామంలోని సరిచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వేతన దారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేసి, పనులకు 182 మంది హాజరైనట్లు గుర్తించారు. అనంతరం వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం రూ.272 అందుతుందని చెప్పారు. జాబ్‌కార్డు ఉన్న వారే పనులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయానికి ఘటాలు,ప్రభలతో వస్తున్న భక్తులు

బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఘటాలు,ప్రభలతో ఆలయానికి మేలతాళాలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పూలాభిషేకం, పంచామృ తాభిషేకం, కుంకుమ పూజలు చేశారు.

సంతకాలకే పరిమితం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వ ర్యంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించడానికి అవకాశం లేదని సభ్యులకు సూచించారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, ఇతర ఎంపీటీసీ సభ్యులతో సంతకాలు చేయించి, సమావేశం ముగిసినట్లు ప్రకటించారు.

వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యుడు సుబ్బారావు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలో ఉన్న జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగార యాజమాన్యం సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ)లో భాగంగా దన్నినపేట గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 40మందికి వైద్యుడు తెన్నేటి సుబ్బారావు వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. జిందాల్ కర్మాగారం ప్రతినిధి గోపా లక్ష్మణ మాట్లాడుతూ సీఎస్ఆర్‌లో భాగంగా కర్మాగారం చుట్టుపక్క గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, వైద్యశిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు, కర్మాగారం ప్రతినిధి వనం సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురు వ్యక్తుల అరెస్టు

గంట్యాడ: గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని స్థానిక ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. విశాఖపట్నం నుంచి రాయపూర్ వెళ్లే గ్రీన్ ఫీల్డ్ హైవేపై తామరపల్లి జంక్షన్ వద్ద గంజాయితో వ్యక్తులు సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ సాయికృష్ణ పోలీసులతో అక్కడికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు మధ్య వర్తుల సమక్షంలోవారిని అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్కరి వద్ద నుంచి 200 గ్రాముల చొప్పున 600 గ్రాముల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు ,మూడు సెల్ ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

ఆధార్ తరహాలో భూ ఆధార్

- ప్రతీ రైతుకు 11 నెంబర్లతో యూనిక్ కోడ్
- వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పొందేందుకు ఈ కార్డులు తప్పనిసరి
- రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభమైన ఫార్మర్ రిజిస్ట్రీ
- వివరాలు ఆన్‌లైన్ చేసుకునే ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు
- ఎల్‌పీఎం నంబర్లు ఆన్‌లైన్‌లో లేకపోవడం, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ కాకపోవడంతో సమస్య



పాలవలస రైతుసేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు ఆన్‌లైన్ చేయించుకుంటున్న రైతులు

గుర్ల: ఆధార్ కార్డు తరహాలోనే దేశంలో ప్రతీ రైతుకు ఒక విశిష్ట సంఖ్యతో భూ ఆధార్ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పొందేందుకు ఈ కార్డులను తప్పనిసరి చేయనున్నారని అధికారులు అంటున్నారు. ఈ కార్డుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చీపురుపల్లి నియోజక వర్గంలోని రైతు సేవా కేంద్రాల్లో(రైతు భరోసా కేంద్రాలు) ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. ఆధార్ కార్డుల ద్వారా దేశంలోని ప్రతీ పౌరునికీ గుర్తింపు ఇచ్చినట్లుగానే రైతులకు 11 నెంబర్లతో యూనిక్ కోడ్ (యూసీ)ను కేటాయిస్తూ కార్డులు ఇవ్వనున్నారు. ఈ కార్డుల కోసం వివరాలు నమోదు చేసుకునేందుకు రైతులు పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని తమ పరిధిలోని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని గుర్ల, గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లో సుమారు 50 వేల మంది రైతులు ఉన్నారు. చాలామంది రైతులకు ఈ కార్డుల గురించి ఇంకా తెలియకపోవడం, వ్యవసాయ సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ప్రారంభమై రెండు రోజులవుతున్నా పదుల సంఖ్యలో కూడా ఆన్‌లైన్ కాలేదు. చాలా మంది రైతులకు తమ ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్లు లింక్ కాకపోవడం కూడా ఒక కారణం. అలాగే రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో ప్రతీ సర్వే నెంబర్‌కు నూతనంగా ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సెల్ మ్యాప్) నెంబర్లు కేటాయించారు. ఎల్‌పీఎం నెంబర్లు ఆన్‌లైన్‌లో రాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే ఎల్‌పీఎం నెంబరు ఇద్దరు, ముగ్గురు రైతులకు కేటాయించడంతో ఆన్‌లైన్ కావడం లేదు. భూమి తక్కువగా ఉన్న రైతులకు ఎక్కువ, ఎక్కువ ఉన్న రైతులకు తక్కువ చూపిస్తుండడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో రైతులున్నారు.

రైతులకు గుర్తింపు...ప్రయోజనాలు

ఆధార్ మాదిరిగా యూనిక్ కోడ్‌తో జారీ చేసే ఈ కార్డులు రైతులకు ఐడీ కార్డుగా ఉపయోగపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను రైతుల యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. రానున్న రోజుల్లో ఈ యూనిక్ నెంబర్ ఉన్న వారికే వ్యవసాయ సంబంధ పథకాలు, రాయితీపై పరికరాలు, ప్రోత్సాహకాలు,ఎరువులు, పంటల బీమా అందుతాయని అధికారులు అంటున్నారు. అలాగే ఈ యూనిక్ నెంబర్‌ను ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకుతో కూడిన సేవలను పొందవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయి.

రైతులు తమ వివరాలు ఆన్‌లైన్ చేసుకోవాలి



మండలంలో సుమారు 11వేల మంది భూయజమానులకు యూనిక్ కోడ్ అందిస్తాం. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో ఆన్‌లైన్ చేసుకోవాలి. ఈనెలాఖరు నాటికి ఈప్రక్రియ పూర్తికావాలి. జాయింట్ ఎల్‌పీఎం నెంబర్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

– ఎ. తిరుపతిరావు, ఏఓ, గుర్ల మండలం

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఆర్యవైశ్యమహాసభ సభ్యుడు ఈశ్వరరావు

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట గ్రామ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిమిత్తం ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.అతిథిగా హాజరైన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పచ్చిపులుసు ఈశ్వరరావు మాట్లా డుతూ విద్యార్థుల జీవితంలో పదోతరగతి కీలకమైనదని అన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగానే ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందని, సమయం వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు తెచ్చేలా మంచి ఫలితాలు సాధించాలని ఆకాం క్షించారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు, మండల సంఘం అధ్యక్షుడు హెచ్.నానాజీ, జిల్లాజాయింట్ సెక్రటరీ బాలనాగు, మండల కార్యదర్శి పి.రవికుమార్, వాసవీక్లబ్ ప్రతినిధులు కె.వెంకటరావు, సురేష్‌కుమార్, పి.అప్పారావు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో తనిఖీలు



ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి.రమణ

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.68 లక్షలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి.రమణ మంగళవారం తనిఖీలు చేశారు. ల్యాబ్‌లో పరిక రాలు, రికార్డులు, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు పాడి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ ప్రయోగశాలలో పశువులు, జీవాలకు అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారని, ఆఫలితాల ఆధారంగా పశువైద్య సిబ్బంది మందులు అందజేస్తారని తెలిపారు. గతంలో నియోజకవర్గాల్లో ఈల్యాబ్‌లు అందుబాటులో లేకపోవడంతో పాడిరైతులు జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌ను ఆశ్రయించాల్సి వచ్చేదని, దీంతో ఫలితాలు వచ్చేందుకు కొంత ఆలస్యమయ్యేదన్నారు. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు లేవన్నారు.వ్యాధి నిర్ధారణ ఫలితాలు వెంటనే రావడం, సకాలంలో సంబంధిత మందులు వేయడం వల్ల పశువులు త్వరగా కోలుకుంటున్నాయని, పశుమరణాలు తగ్గాయని చెప్పారు.ఆయన వెంట కొత్తవలస డివిజన్ ఏడీ బి.గంగాధర్, ల్యాబ్ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పరదేశిమాంబ తీర్థం



ఎడ్ల పరుగుల పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న చినరామునాయుడు, తదితరులు

వేపాడ: చినగుడిపాలలో గ్రామదేవత పరదేశిమాంబ తీర్థ మహోత్సవం రెండోరోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశా రు.పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.సాయంత్రం ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 13 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా...దేవరాపల్లికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో, తుమ్మికాపల్లికి చెందిన ఎడ్లు ద్వితీయ స్థానంలో, వావిలపాడు ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, సర్పంచ్ రామునాయుడు, ఎంపీటీసీ టి.వి.రమణ, గ్రామపెద్దలు రామకృష్ణ, జగ్గునాయుడు, కండిపల్లి పెదనాయుడు నగదు బహుమతులు అందజేశారు.

తీగ లాగితే డొంక కదిలింది

- 2.249 కేజీల నల్లబెల్లం, 40 లీటర్ల సారా స్వాధీనం
- నలుగురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు
- పరారైన మరో ఇద్దరు కోసం గాలింపు



దాడుల్లో పట్టుబడిన సారా, నల్లబెల్లం

చోడవరం (అనకాపల్లి జిల్లా): రెండు క్యాన్లతో సారా తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా, తీగ లాగితే డొంక కదిలినట్టుగా నల్లబెల్లం గుట్టు రట్టయింది. సారా తయారీకి వినియోగించేందుకు విక్రయిస్తున్న 2,240 కేజీల నల్లబెల్లాన్ని వారి దాడుల్లో సీజ్ చేశారు. ఈ దాడుల్లో సారా తరలిస్తున్న వారిని, నల్లబెల్లం విక్రయం, రవాణా చేస్తున్న నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు, ఎస్ఐ శేఖరం ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు చోడవరం–చీడికాడ రోడ్డులో చోడవరం శివారు ఐటీ కాలనీ సమీపంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణారాయుడుపేట గ్రామం నుంచి యాండ్ర సురేష్, సిమ్మ శ్రీనువాసరావు స్కూటీపై రెండు క్యాన్లతో 40 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసి విచారించారు. వీరి విచారణలో సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం గుట్టు రట్టయ్యింది. కె. కోటపాడు మండలం ఎడ్లవానిపాలెం గ్రామంలో ఎడ్ల సత్యనారాయణ నల్లబెల్లాన్ని గుట్టుచప్పుడు కాకుండా సారా తయారీదారులకు విక్రయిస్తున్నట్టు తేలింది. దీంతో ఎక్సైజ్ అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి దాడులు చేయగా, అక్రమంగా నిల్వ ఉంచిన 2,249 కేజీల నల్లబెల్లం దిమ్మలు బయటపడ్డాయి. ఈ బెల్లాన్ని సీజ్ చేయడంతోపాటు ఇదే ప్రదేశంలో 25 కేజీల అమ్మోనియా దొరకడంతో విక్రయదారు సత్యనారాయణను అరెస్టు చేశారు. ఇంత పెద్దమొత్తంలో ఉంచిన నల్లబెల్లాన్ని వాహనాలపై సరఫరా చేస్తున్న కుక్కల రామును అరెస్టు చేశారు. సారా తయారీ విక్రయాల్లో ప్రధాన నిందితులైన చోడవరం ఐటీ కాలనీకి చెందిన అప్పలరాజు, అప్పారావులను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు.

ఆదివాసీ విప్లవ వీరునికి నివాళి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివాసీ విప్లవ వీరుడు, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు బాబా తిల్కా మాంఝీ జయంతి ఉత్సవాలు చరిత్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిల్కామాంఝీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారి ఆదిపత్యాన్ని వ్యతిరేకించి తిరుగుబాటు బావుటా ఎగరేసిన తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు తిల్కామాంఝీ అని అన్నారు. 1857నాటి సిపాయిల తిరుగుబాటుకు 70ఏళ్ల ముందుగానే సాయుధ పోరాటంతో తెల్లదొరలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన ఆదివాసీ యోధుడని చెప్పారు. 35ఏళ్ల వయసులోనే అసువులు బాసి స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోశారని అన్నారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్‌పీసీల జారీలో అలసత్వం వద్దు

దత్తిరాజేరు: గ్రామాల్లో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి ఎల్‌పీసీ(ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్)ల జారీలో అలసత్వం ప్రద ర్శించవద్దని వీఆర్‌ఓలకు తహసీల్దార్ విజయభాస్కర్ సూచించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019కు ముందు నిర్మించిన ఇళ్లను పరిశీలించి వాటికి పట్టాలు జారీ చేయాలా వద్దా అనేది నిర్ణయించాలన్నారు. రైతుల భూసమస్యలను సత్వర మే పరిష్కరించేలా పనిచేయాలని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, ఆర్‌ఐ నారాయణరావు పాల్గొన్నారు.

15 నాటికి పశుగణన పూర్తి చేస్తాం

- పశుసంవర్ధక శాఖ జేడీ వై.వి.రమణ

లక్కవరపుకోట: ప్రస్తుతం నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ నాటికి వందశాతం పూర్తి చేస్తామని, ఇప్పటికే 91 శాతం సర్వే పూర్తయినట్టు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవి.రమణ తెలిపారు. లక్కవరపుకోట పశు వైద్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 1092 గ్రామాలు, వార్డుల్లోని 5,12,683 గృహ సముదాయాల్లో 235 మంది ఎన్యూమనేటర్లు, 68 సూపర్ వైజర్లతో పశుగణన చేపట్టామని తెలిపారు. ఇప్పటి వరకు 4,71,204 గృహాల పరిధిలో గణన పూర్తిచేశామన్నారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రభావం లేదన్నారు. నాటుకోళ్లకు మాత్రం కొక్కెరవ్యాధి సోకుతోందని, వ్యాధి నియంత్రణకు టీకాలు వేస్తున్నామన్నారు. జిల్లాలో మొదటి విడతగా మంజూరైన 986 గోశాలల్లో నేటికి 686 నిర్మాణాలు పూర్తయినట్టు వెల్లడించారు. జిల్లాలోని 140 మంది గోపాలమిత్రలకు నవంబర్ నెల వరకు గౌరవ వేతనం అందజేసినట్టు తెలిపారు. పాడి రైతులందరికీ పశుకిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తామన్నారు. ఆయన వెంట పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి ఉన్నారు.

అభయాంజనేయస్వామి తీర్థం



శ్రీరాంపురం గ్రామంలో అభయాంజనేయ స్వామివారి తీర్థ మహోత్సవాన్ని గ్రామస్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఐ.సతీష్ ఆచారి స్వామివారికి క్షీరాభిషేకం, సిందూరం , తమలపా కులతో అర్చన చేశారు. అనంతరం స్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. – లక్కవరపుకోట

సస్యరక్షణ చర్యలపై అవగాహన



గత కొద్దిరోజులుగా మంచు విపరీతంగా కురుస్తోందని, మామిడి పూతపై మంచు ప్రభావం చూపే ప్రమాదం ఉందని రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే పూతను రక్షించుకోవచ్చని హెచ్‌ఓ పప్పు పద్మ తెలిపారు. ఎల్.కోట మండలంలోని భీమాళి, కొత్తవలస మండలంలోని కంటకాపల్లి గ్రామాల్లో మామిడి రైతులకు సస్యరక్ష ణ చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు.హెచ్‌ఓ మాట్లాడుతూ ఎల్.కోట,కొత్తవలస మండలాల్లో సుమారు 2,900 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంద న్నారు. ప్రస్తుతం మామిడిపూత పిందె కట్టేదశలో ఉందని, మంచు వల్ల ఆశించే చీడపీడల నివారణకు థయోమిథాక్సమ్ మందును లీటరు నీటికి 0.5 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేసుకో వాలన్నారు. బూడిద,పక్షికన్ను తెగుళ్ల నివారణకు కాపరాక్సీక్లోరైడ్ మందును లీటరు నీటిలో 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూ చించారు. – లక్కవరపుకోట

కొలతల ప్రకారం పని చేయాలి



ఉపాధి హామీ పథకం సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు వేతనం అందుతుందని ఎంపీడీఓ సూర్యనారాయణ వేతనదారులకు సూచించారు. పాటూరు గ్రామంలో నిక్రవాని చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, జాబ్ కార్డుల్లో పేర్లు ఉన్న వారే పనులకు హాజరు కావాలని చెప్పారు. ఎండల తీవ్రత పెరుగు తున్న నేపథ్యంలో పనిప్రదేశంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని, తాగునీరు తెచ్చుకోవాలని సూచించారు. పనికి హాజరయ్యే వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. – వేపాడ

కొనసాగుతున్న క్రీడా సాంస్కృతిక పోటీలు



క్రీడాపోటీల్లో తలపడుతున్న వాలీబాల్ టీమ్

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి వెటర్నరీ కళాశాలలో రెండో రోజు క్రీడా సాంస్కృతిక పోటీలు కొనసాగాయి. 12వ రాష్ట్రస్థాయి అంతర వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాసాంస్కృతిక పోటీలు సోమవారం ప్రారంభమైన విషయం విదితమే. ఈ క్రీడాసాంస్కృతిక పోటీల్లో భాగంగా పలు క్రీడాంశాల్లో పలు కళాశాలలు విన్నర్స్‌గా నిలవగా మరికొన్ని కళాశాలలు రన్నర్స్‌గా నిలిచాయి. బాలికల విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మడకశిర కళాశాల విద్యార్థులు విజయం సాధించగా గరివిడి కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.టేబుల్ టెన్నిస్ పోటీల్లో మడకశిర కళాశాల విజయం సాధించగా గరివిడి కళాశాల రన్నర్స్‌గా నిలిచారు. బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో గరివిడి కళాశాల ఫైనల్స్‌కు చేరుకుంది. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మడకశిర కళాశాల ఫైనల్స్‌కు చేరుకుంది. అదే విధంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సంక్షిప్తంగా...

మంచుతో మామిడికి ముప్పు



రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ చంద్రశేఖర్

మెరకముడిదాం: విపరీతంగా కురుస్తున్న మంచుతో మామిడి పంటకు ముప్పు పొంచి ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హెచ్‌ఓ చంద్రశేఖర్ రైతులకు సూచించా రు. చినబంటుపల్లి గ్రామంలో మామిడి రైతులకు తెగుళ్ల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. బంగినపల్లి, సువర్ణరేఖ రకాల్లో మంచు వల్ల పిందెలు పసుపురంగులోకి మారుతున్నాయని అన్నారు.తెగుళ్ల నివారణకు ట్రాక్టర్ ట్యాంకర్ నీటిలో (3వేల లీటర్లు) 1.5 కిలోల థయోమిథాక్సామ్, 1.5 కిలోల మైక్లోబ్యుటానిల్, 750 మిల్లీలీటర్ల ప్లానోఫిక్స్, 15 కిలోల 0.0.52.34 ఎరువు మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. గింజపూతలో ఉన్న మామిడిపంటకు థయామిథాక్సామ్ 1.5 కిలోలు, ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటర్, జీనాబ్ 6 కిలోలు ట్రాక్టర్ ట్యాంకర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లల విడుదల

వేపాడ: పాటూరు గ్రామంలోని చెరువుల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 20 వేల చేపపిల్లలను మంగళవారం విడుదల చేశారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ ఏ.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగౌరి ఆలయానికి మరమ్మతులు

గజపతినగరం రూరల్: గంగచోళ్లపెంట గ్రామంలో మే నెలలో మజ్జిగౌరి అమ్మవారి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామస్తులు ఆలయ మరమ్మతులు చేపడుతున్నారు. గ్రామస్తులంతా చందాలు పోగు చేసుకుని పెచ్చులూడిన శ్లాబ్‌కు మరమ్మతులతో పాటు ఆలయ విస్తరణ పనులను చేయిస్తున్నారు. ఈ ఆలయానికి చుట్టు పక్క గ్రామాల నుంచి నిత్యం భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



దత్తిరాజేరు: కె.కొత్తవలస పీహెచ్‌సీలో గర్భిణులకు సూచనలు చేస్తున్న డాక్టర్ స్రవంతి

దత్తిరాజేరు: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.కొత్తవలస పీహెచ్‌సీలో వైద్యాధికారి స్రవంతి 30 మంది గర్భిణులకు మంగళవారం వైద్యపరీక్షలు చేశారు.మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. ఆకు కూరలు,కూరగాయలు,పాలు, గుడ్లు ఆహారంగా తీసుకుంటూ, ఇంట్లో చిన్న చిన్న పనులు చేస్తుండడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు.

వేపాడలో..

వేపాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ధరణి 32 మంది గర్భిణులకు మంగళవారం వైద్య తనిఖీలు చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలని, ఆస్పత్రిలోనే కాన్పు చేయించుకోవాలని చెప్పారు. విధిగా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చన్నారు. బానాది సత్య సాయి సేవా భజన మండలి సభ్యులు సమకూర్చిన భోజనాలను గర్భిణులు, వారి సహాయకులకు అందించారు. సీహెచ్‌ఓ ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.